# చదువుతోబాటు సంస్కారముకూడా చాలా అవసరము

**ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన**
**మహనీయులను గన్న మాతృభూమి**
**పాశ్చాత్యవీరుల పారద్రోలించియు**
**స్వాతంత్ర్యమును గన్న సమరభూమి**
**పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు**
**ప్రతిభ చూపినయట్టి భరతభూమి**
**సంగీతసాహిత్య శాస్త్రీయ విద్యల**
**ధీశక్తి చూపిన దివ్యభూమి**
**చిత్రకళలతోడ చిత్రమై యున్నట్టి**
**భరతభూమియందు జననమొంది**
**భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ**
**బాధ్యతంతయు మీదె బాలులార!**

ప్రేమస్వరూపులారా!

భారతదేశమునందు ఎన్నో కళలతోకూడిన విద్యావిధానము ఈనాడు శక్తి హీనమైన స్వరూపాన్ని ధరిస్తున్నాది. కేవలము డిగ్రీలయొక్క విలువమాత్రమే చేర్చుకుంటున్నది. పట్టమునందుకొని పొట్టను నింపుకొనేందుకే ఈ డిగ్రీ ఉపయోగపడుతున్నది. సమాజముయొక్క సమస్యలను పరిహారము గావించే నిమిత్తమా డిగ్రీలు, లేక కేవలం పుస్తకజ్ఞానమును పొందే నిమిత్తమా డిగ్రీలు? ఈ విధమైన విచారణను విద్యార్థులుగానీ, విద్యాధికారులుగానీ విద్యార్థుల తల్లితండ్రులుగానీ ఎవ్వరు చేయటంలేదు.

srisathyasaivahamrutam

## ఏది జ్ఞానమును బోధించునో అదే విద్య

సమాజమునకు గానీ దేశమునకు గానీ ఉపయోగము లేని విద్యలు విద్యలౌతాయా? ప్రతి సంవత్సరము లక్షలాది గ్రేడ్యుయేట్సును తయారు చేసి ప్రపంచములో వదలిపెడుతున్నాయి, ఈ విద్యాసంస్థలు. వీరి భవిష్యత్తు ఏమిటి? ఈ విద్యావిధానముయొక్క గమ్యము ఏమిటి? చదువుయొక్క సారమేమిటి? ఈ విధమైన ప్రశ్నలు మనము వేసుకున్నప్పుడు. ఈనాటి విద్యా విధానము కేవలం యాంత్రికముగా జరుగుతున్నాది. ఈనాటి విద్యలలో సౌజన్యముగానీ, సౌశీల్యముగానీ, సాంప్రదాయముగానీ ఏమాత్రము కనిపించటంలేదు. విద్య కేవలము స్వార్థస్వప్రయోజన నిమిత్తమై అనుభవిస్తున్నారే గానీ సమాజసంక్షేమ నిమిత్తమై ఏమాత్రము ఉపయోగపెట్టటంలేదు. భారతదేశమందు 200 విశ్వవిద్యాలయములుంటున్నవి. 90,000 కళాశాలలుంటున్నవి. ఒక కోటిమంది విద్యార్థులు డిగ్రీక్లాసులలో విద్యనభ్యసిస్తున్నారు. వీటియొక్క విధానము ఏమిటి, వీటియొక్క ప్రయోజనము ఏమిటి, వీటి ఫలితము ఏమిటి అనే విషయమును ఎవరూ నిర్ణయించలేకపోతున్నారు. ప్రతి సంవత్సరము యింతమంది విద్యార్థులను గ్రాడ్యుయేట్సుగా చేసి ప్రపంచములోకి వదలుతుంటే ఈ ప్రపంచముయొక్క పరిస్థితి ఏవిధంగా ఉంటుంది? అదికూడా ఎవరూ విచారణ చేయటంలేదు. యివి కేవలము డిగ్రీలనందించే వర్కుషాపులవలె కనిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు గురించి ఎవరూ ఏమాత్రము యోచించటంలేదు. ఈనాటి ప్రభుత్వముకూడా విద్యాసంస్థల సంఖ్యను పెంచుతున్నదిగానీ విద్యావిధానమును సక్రమమైన మార్గములో తీర్చి దిద్దటంలేదు. ఎక్కడచూచినా విద్యాసంస్థలు పుట్టగొడుగులవలె పుడుతూ వస్తున్నాయి. ప్రభుత్వముయొక్క అనుమతి లేకుండా అనేక సంస్థలు నడుస్తున్నాయి. అందరూ విద్యావంతులవలె కనిపిస్తున్నారు; కానీ చదువంటే ఏమిటో ఎవరికి తెలియటంలేదు. వి-ద-య. ఏది జ్ఞానమును బోధించునో అదే విద్య. ఎట్టి జ్ఞానము? లౌకిక జ్ఞానమా లేక భౌతికజ్ఞానమా? ప్రాకృతజ్ఞానమా? పదార్థజ్ఞానమా? బ్రహ్మజ్ఞానమా? ఆత్మజ్ఞానమా? ఇక్కడ bookish knowledge మాత్రమే కనిపిస్తున్నాది. మరి ఏ ఇతర knowledge మనకు కనిపించటంలేదు. ఇలాంటి పరిస్థితియందు ఈ విద్యవిలువ ఏవిధంగా నిర్ణయించేందుకు వీలవుతుంది?



srisathyasaivachanamrutam

**నిత్య జీవితములో ఉపయోగపడని విద్యలయొక్క ఫలమేమి?**

**ఫలమివ్వని వృక్షమువలె, రసములేని ఫలమువలె**
**పుట్టిగిట్టి ఏమి ఫలము? ఫలమెరుగక పుట్టినావు**
**ఫలమెరుగక మరణించిన తానెవరో తెలియకున్న**
**ఇక తెలిసినదేమన్నా?**

ఇంక ఏమిటి నీవు తెలుసుకున్న విద్య? ఫలనిమిత్తమై నీవు విద్యనభ్యసిస్తున్నావు. ఫలము ఏమిటో నీకు తెలియనప్పుడు ఈ విద్యలు అభ్యసించి ప్రయోజనం ఏమిటి? ఈనాటి విద్యలు

**నేటి విద్య తెలివితేటలనే పెంచు**
**కొంచెమైన గుణము పెంచబోదు**
**కోటి విద్యలుండి గుణము లేకున్నచో**
**అట్టి విద్య కన్న మట్టి మిన్న.**

ఈ తెలివితేటలు దేని నిమిత్తమై మనకు అవసరము? ఇవి పరులను వంచించే నిమిత్తము, స్వార్థమును పోషించుకునే నిమిత్తము, స్వప్రయోజనము అనుభవించే నిమిత్తము ఉపయోగిస్తున్నాయేగానీ దేశమునకుగానీ సమాజమునకుగానీ తనయొక్క విద్య ఏమాత్రము అనుకూలపడటంలేదు. నిత్యజీవితములో ఉపయోగపడని విద్యలు ఏమి విద్యలు? ఈనాటి మానవత్వములో తెలివితేటలు ఏవిధంగా మనకు కనిపిస్తున్నాయి?

**ఆశలు కాదు మనకు ప్రధానము; ఆశయాలు ప్రధానము**

**దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న**
**పొంచిచూచు కనులున్న పంచల విను మనసున్న**
**వంచన గుణ చిత్తమున్న వంచించే పలుకున్న**
**ఈ వికృతులు చూడగనే న్యాయమింక బ్రతుకదన్నా**

మానవత్వములోని మంచి అంతయు నిర్మూలమైపోతున్నాది. సమాజములో బలహీనమైనవారలకు సహాయపడవలసిన విద్యార్థులు ఈనాడు అనేక సమస్యలతో

srisathyasaivachanamrutam

సమాజమునకు తొందరలు కలిగిస్తున్నారు. ఇది విద్యార్థులయొక్క దోషముకాదు. విద్యావిధానముయొక్క దోషమే! ఈ విద్యావిధానము మార్చే నిమిత్తమై అనేక కమిటీలు వేస్తూవచ్చింది, ప్రభుత్వము. మొరార్జీ దేశాయ్ కాలమునుంచి నేటివరకు యింకా కమిటీలు వేస్తూనే ఉంటున్నాది. ఈ కమిటీలు ఏమి నిర్ణయములు చేశాయో ఎవ్వరికి తెలియటంలేదు. ఇక కమిటీల ఉపయోగం ఏమిటి? come for tea; ఇవన్నీ వారి comfort కోసం వారు వేసుకుంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టియందుంచుకొని పవిత్రమైన భారతపౌరులుగా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యము ఎవ్వరియందు కనిపించటంలేదు. విద్యార్థులు ఆదర్శవంతమైన పౌరులుగా రాణించాలి. ఉత్తమ ఆదర్శములను అలవరచుకోవలసిన విద్యార్థులీనాడు ఆశలకు గురౌతున్నారు. ఆశలుకాదు మనకు ప్రధానము, ఆశయాలు ప్రధానము. ఉత్తమ చింతనలతో జీవించవలసిన విద్యార్థులు ఈనాడు సంకుచితభావములతో సంచరిస్తున్నారు. విద్యార్థులందు మానవత్వము అంటే ఏమిటో తెలియకుండా పోతున్నాది. 'నేను మానవుడు, మానవుడు' అని చెప్పుకుంటున్నాడు గానీ 'మానవ' అంటే అర్థము తెలుసుకోవటంలేదు.

**మనస్సు, వాక్కు, క్రియల ఏకత్వమే మానవత్వమనే సత్యాన్ని విద్యార్థులకు బోధించాలి.**

The proper study of mankind is man అన్నారు. అనగా మనస్సు, వాక్కు, క్రియలయొక్క ఏకత్వమే మానవత్వమనే సత్యాన్ని యీనాడు ప్రబోధించాలి. నేడు ఈ ఏకత్వభావము భిన్నత్వంగా రూపొందింది. ఈ భిన్నత్వముచేత భిన్నభిన్న బాధలకు గురౌతున్నారు, మానవులు. మనకు చదువు ప్రధానముకాదు, సంస్కారము చాలా అవసరము.

**పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ**
**సంస్కృతమడుగంటి సన్నగిల్లె**
**పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ**
**పరిణయ ధర్మముల్ వమ్ములయ్యె**
**పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ**
**ఆర్యధర్మములెల్ల ఆరిపోయె**

srisathyasaivachanamrutam

**పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ**
**వేషభాషలయందు మోజు హెచ్చె**
**తల్లి భాషను మాట్లాడ తప్పుదోచె**
**సంఘమర్యాద పాటింప జంకు పుట్టె**
**ధర్మమన్నది బోధింప తప్పిపోయె**
**ఇట్టులైనది భారతజాతి నేడు.**

అన్ని విధాలా ఈ విద్యావిధానము విచ్ఛిన్నమైపోతున్నాది. దినదినమునకు విద్యావిధానములో విలువలు క్షీణించిపోతున్నాయి. విద్య కేవలము వ్యాపారరంగమువలె ఉపయోగపెట్టుకుంటున్నారు. ఇక వైద్య, యింజనీరింగు విద్యలలో మరింత వ్యాపారము అధికమైపోతూ వస్తున్నది. లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి విద్యార్థులు ఈ డిగ్రీలు పొంది అనుభవించే ఆనందం ఏమిటో నాకు అర్థముకావటంలేదు. మొదట విద్యార్థులు తమ నిత్యజీవితములో అవసరమయ్యే క్రియలలో తాము పాల్గొనాలి. మనలో నున్న general knowledge, commonsense develop చేసుకోవాలి. మనకు practical knowledge ప్రధానమైన ప్రమాణము. ఈనాటి విద్యలలో కేవలం గ్రంథపరిచయము మాత్రమే కనిపిస్తున్నాది. యిందులో ఏమాత్రము గంధము లేదు. యిలాంటి విద్యలచేత ఈనాడు ప్రపంచములో అనేకమంది అనేక పెడమార్గములు పట్టి దురభ్యాసములచే, దుస్సంగములచే, దుర్మార్గములచే జీవితము వ్యర్థము గావించుకుంటున్నారు.

**మన మంచి, చెడ్డలకు మన ప్రవర్తనయే మూలకారణము**

విద్యార్థులారా! భరతమాత పవిత్ర సంస్కృతిని మీరు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. మీరు పుట్టినది భారతదేశమందు. మీరు పీల్చుకునే గాలి, భరతమాత గాలి. మీరు త్రాగే నీరు భరతమాత నీరే! మీరు జీవించే జీవితమంతా భరతమాత సంపత్తే. తల్లి అడుగుజాడలనుసరించి, పవిత్రమార్గములో ప్రవేశించి సమాజమునకు సరైన సేవలలో మీరు పాల్గొనాలి. సమాజసేవలో పాల్గొనే సంస్కారము పెంచుకోవాలి? అప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. లేకుండిన

sri sathyasai vacharamrutam

**ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము?**
**నొసటి వ్రాతను తప్పింపనెవరి తరము?**
**చెడ్డ బుద్ధులు తన తల చేరెనేని**
**ఎండబారును బుద్ధులు బండబారు.**

మన మంచి చెడ్డలకు మన ప్రవర్తనలే మూలకారణము. చదువులో దోషములేదు. సంస్కారములో దోషములేదు. కానీ వ్యక్తియొక్క ప్రవర్తనలోనే దోషము ఉంటున్నాది. పవిత్రమైన జలము పరిశుద్ధమైన తెల్లని సీసాలో పోసినప్పుడు తెల్లగా కనిపిస్తుంది. కానీ అదే జలమును ఎఱ్ఱని సీసాలో పోసినప్పుడు ఆ నీరు ఎఱ్ఱగా కనిపిస్తుంది. ఈ దోషము జలముదా లేక బాటిలుదా! బాటిలుదే దీని దోషము. అదే విధముగా పవిత్రమైన విద్యావిధానము చాలా సున్నితమైనది, పవిత్రమైనది, నిర్మలమైనది, నిస్వార్థమైనది. స్వార్థస్వప్రయోజనములనే మాలిన్యములతో కూడేటప్పటికి యిది మాలిన్యముగా కనిపిస్తున్నాది.

## మానవ జీవితమంతయు మనస్సుపై ఆధారపడియున్నది

మొట్టమొదట మానవుడు తన మనస్సును పరిశుద్ధము గావించుకోవాలి. ఆ మనస్సు పరిశుద్ధమైనప్పుడే చూపులు, నడతలు, వినికిడి అన్నీ పరిశుద్ధముగానే ఉంటాయి. మానవ జీవితమంతయు మనస్సుపై ఆధారపడి ఉంటున్నాది. కేవలము మానవజీవితమేకాదు, యావత్ విశ్వమే మనస్సుపై ఆధారపడి ఉంటున్నాది. 'మనోమూలమిదం జగత్' జగత్తంతా మనస్సుపైనే ఆధారపడి ఉంది. కనుక, మనము మనస్సును మంచిగా చేసుకున్నప్పుడు మనిషికూడా అట్టివాడవుతాడు. వీడు చెడ్డవాడు అంటే మనస్సు చెడ్డది కనుక, వాడు చెడ్డవాడు. ఇతను మంచివాడనగా మనసు మంచిది కాబట్టే యితను మంచివాడు. మనస్సు లోపల ఉండేది. మనిషిది బాహ్యస్వరూపము. ఈనాటి మానవుడు స్వార్థస్వప్రయోజన దృష్టితోనే అన్నీ చూస్తున్నాడు. తన స్వార్థనిమిత్తమై ప్రపంచమును ప్రేమిస్తున్నాడుగానీ ప్రపంచము నిమిత్తమై ప్రపంచమును ప్రేమించటంలేదు. ఒక వ్యక్తిని ప్రేమించినట్టుగా నటిస్తుంటాడు కానీ, వ్యక్తిని ప్రేమించటంలేదు. తన నిమిత్తమై తాను ఆ వ్యక్తిని

srisathyasaivachanamrutam

ప్రేమిస్తున్నాడు. ఈ విధమైన పరిశోధనలు చక్కగా చేసినప్పుడు ప్రతిదానియందు స్వార్థము, స్వార్థము. స్వార్థము ఉండవలసినదే! కానీ దానికికూడా ఒక పరిమితము ఉంటుండాలి. ఈనాటి మానవుడు బయట సమాజములో ప్రవేశించినప్పుడు మారిపోతున్నాడు. సంస్థలలో ఉన్నంతవరకు తాను ఎంతో గుణవంతుడుగా కనిపిస్తాడు. బయట ప్రపంచములో ప్రవేశించేటప్పటికి అక్కడ ఈ మంచి చెడ్డగా మారిపోతున్నాది.

**ఎట్టివారితో నీవు చేరుదువో అట్టి రూపమునే మనస్సు పొందుతుంది**

విద్యార్థులారా! ఎక్కడ ఉండినప్పటికి సత్సంగములో మీరు ప్రవేశించండి. సద్భావములను పెంచుకోండి. సత్కర్మలు ఆచరించండి. సదాచారములో మీరు బ్రతకండి. అప్పుడే మానవత్వమునకు సరైన విలువ చేకూరుతుంది. ఎట్టివారితో నీవు చేరుదువో అట్టి రూపమునే మనస్సు పొందుంది. Tell me your company, I shall tell you what you are. నీవు ఎలాంటివాడవో నీ కంపెని పురస్కరించుకొని చెప్పవచ్చును. మీరు బయట ప్రపంచములో మంచి కంపెనిలో చేరి, మంచిమాటలు మాట్లాడి, మంచి కర్మలు ఆచరించి, మంచి జీవితాన్ని గడపండి. విద్యార్థులందరు చాలా మంచివారే! కానీ సహవాస దోషముచేత విద్యార్థి మనస్సు మాలిన్యమవుతున్నాది. భూమిపైనున్న మట్టి గాలితో చేరితే గగనమువరకు ఎగురుతుంది. ఎగరటానికి దానికి రెక్కలులేవు. నీటితో చేరితే గుంతవరకు దిగిపోతున్నాది మట్టి. క్రిందికి దిగటానికి కాళ్లు లేవు, పైకి ఎగరటానికి రెక్కలులేవు. కానీ సహవాస దోషముచేత పైకి, క్రిందికి దిగుతున్నాది. ఈ సత్యమును విద్యార్థులు చక్కగా గుర్తించి అతి జాగ్రత్తగా జీవితమును కాపాడుకోవాలి. 'సర్వలోక హితే రతాః' అన్ని లోకములకు హితమైన రీతిలో మనం జీవించాలి. అన్నింటియందు జ్ఞానము సమత్వంగా ఉంటుండాలి. మంచి గుణములు విద్యార్థులందు అభివృద్ధి గాంచాలి. ఈ మంచి గుణములు నింపుకున్నప్పుడే జీవితమంతయు మంచిగా రాణిస్తుంది. ఈనాటి ప్రపంచము మీకు తెలియనిదికాదు. అనేక అశాంతులతో, భయభ్రాంతులతో నిండి ఉంటుండాది. దీనికి కారణము ఏమిటి? అన్నింటికి ఆధారంగా ఉండి, మనకు కనిపించకుండా ఉండునది స్వార్థమే! ఇదే మూలకారణము. సత్యమును విడవకూడదు. సత్యమే మన జీవితము.

srisathyasaivachanamrutam

సత్యము త్రికాలాభాద్యము. సత్యము మారేదికాదు. ఆ సత్యమే అన్ని విధములా విజయము చేకూర్చేది. 'సత్యమేవ జయతే'. మీరు చూసి ఉంటారు. చైనీస్‌కూడా వారి దేశము, వారి సంస్కృతి వేరైనా వారుకూడ సత్యమును పాటిస్తూ వచ్చారు. సర్వవిజయములు సత్యమునే వరిస్తాయి. సమస్త సంపదలు సత్యమునే వరిస్తాయి. సర్వభోగభాగ్యములు సత్యమునే ఆశ్రయిస్తాయి. ప్రహ్లాదుడు శౌర్యమును కోల్పోయాడు. తన యశస్సు కోల్పోయాడు. కట్టకడపటికి సత్యముకూడా తనను వదలిపెట్టి పోవటానికి ప్రయత్నించింది. అప్పుడు ప్రహ్లాదుడు సత్యము పాదము పట్టుకొని 'ఎవరు పోయినా ఫరవాలేదు, నాకు దుఃఖము లేదు. నీవు మాత్రము నన్ను వదలి పోకూడదు' అన్నాడు. సత్యము ఎప్పుడు ప్రహ్లాదుని దగ్గర నిల్చిపోయెనో అప్పుడు పోయిన యశస్సు, సంపద, రాజ్యము సర్వము వెనుకకు వచ్చాయి.

**సత్యమును పాటించాలి, ధర్మముతో నడుచుకోవాలి**

విద్యార్థులారా! మీ ఆఫీసు పని పురస్కరించుకొని గానీ, లేక మీ ఫ్యాక్టరీస్ పని పురస్కరించుకొనిగానీ అసత్యము ఆడవలసి వచ్చినప్పుడు మీరు ఏమాత్రము జంకు చేయక సత్యమునే పాటించాలి. ధర్మముతో నడచుకోవాలి. ఏమిటి ధర్మము? నీ conscience యొక్క సత్యమే నిజమైన ధర్మము. చక్కగా విచారణ చేయి. నీ conscience yes అన్నప్పుడు దానిని ఆచరణలో పెట్టు. దానిని పురస్కరించుకొనే ప్రాచీన వేదములన్నీ 'సత్యంవద, ధర్మంచర' అని బోధించాయి. యిదియే ప్రాచీన కాలమందు ఋషుల దగ్గర విద్యనభ్యసించి గురుకులమునుంచి వెళ్ళే విద్యార్థులను చేరదీసి ముందుగా ఋషులు వారికి బోధించిన బోధనలు. దీనినే స్నాతకోత్సవము అన్నారు. మొట్టమొదట వారు బోధించినది 'సత్యంబ్రూయాత్, ప్రియంబ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం' సత్యమును పలుకు, అసత్యమును పలకవద్దు. అప్పుడే నీ జీవితము చక్కగా ప్రకాశిస్తుంది, వికసిస్తుంది. ఎలాంటి పరిస్థితులందైనా మానవత్వమును వదలకుండా చూచుకో! ఇవియే ప్రధానబోధలుగా భావించారు. గురువు అందించిన ప్రధానవరము ఇదియే! దీనినే యీనాడు convocation గా భావిస్తూ వచ్చారు. ఆ కాలమునుండి యిప్పటివరకు ఈ convocation అనేక రూపములలో బోధిస్తూ వస్తున్నారు.

sri sathyasai vahini

**మీరు మంచిపేరు తెచ్చుకొని, మీ తల్లితండ్రులకు మీ విద్యాసంస్థలకుకూడా మంచిపేరు తెప్పించండి!**

విద్యార్థులారా! యిది మీకు గొప్ప అవకాశము. దీనిని మీరు పవిత్రమైన దినముగా విశ్వసించాలి. సద్బోధలు మీ హృదయములో ప్రవేశించాలి. సన్మార్గములు మీ జీవితములో ప్రవేశించాలి. సత్కీర్తిని మీరు ఆశించాలి. నేను కోరేది అది ఒక్కటే! మీరు మంచి పేరు తెచ్చుకోండి! తల్లితండ్రులకు మంచిపేరు తెప్పించండి! మీరు చదివిన Institution కు మంచిపేరు తెప్పించండి! చెడ్డ చేయటం గొప్పతనముకాదు. కీటకముకూడా కీడు చేయగలదు. కీడు చేయటం మానవత్వము కాదు. నీవు దేనికి భయపడనక్కరలేదు. సత్యమునకు మాత్రమే భయపడు! ఇతర విషయములకు భయపడుటకు నీవు పశువుకాదు. భయపెట్టటానికి నీవు మృగముకాదు. నీవు మనిషి. నీవు భయపడకూడదు, భయపెట్టకూడదు. ఈ సత్యమును మీరు గుర్తించి వర్తించినప్పుడే సమాజముకూడా బాగుపడుతుంది.

విద్యార్థులారా! మీరు మాత్రమే బాగుపడటం కాకుండా మీ స్నేహితులు, మీ మిత్రులు అనేకమంది ఉంటారు. వారినికూడా ఈ పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టి వారిని ధన్యులు చేయటానికి ప్రయత్నిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 22-11-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam